సాక్షి
శ్రీకాకుళం
బుధవారం • 6 • ఆగస్టు • 2025



పొట్ట కొట్టొద్దు

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విభజనపై దళితులు మండిపడుతున్నారు. ఆందోళనలు చేస్తున్నారు. - 10లో



భక్తుల 'కళ్ల'కు గంతలు

అరసవల్లిలో మొక్కుల పేరిట నకిలీ కళ్లు అంటగడుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించారు. - 10లో

స్త్రీనిధి రుణాల రికవరీ బాగు

పొందూరు: స్త్రీనిధి రుణాల రికవరీలో రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని స్త్రీనిధి ఏజీఎం వి.సత్యనారాయణ అన్నారు. పొందూరులోని వెలుగు కార్యాలయంలో మంగళవారం స్త్రీనిధి రుణాల రికవరీపై వీఓఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అన్ని మండలాలు స్త్రీనిధి రుణాల రికవరీలో ముందంజలో ఉండడంతో 99 శాతం రికవరీ జరిగిందని చెప్పారు. పొందూరు మండలం మాత్రం అట్టడుగులో ఉందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.278కోట్లు స్త్రీనిధి రుణాలను అందజేయడమే లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు.

న్యూస్‌రీల్

పాలకులకు చెంప పెట్టు

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి పంచాయతీ సర్పంచ్ కొణపల సురేష్‌కుమార్ చెక్ పవర్‌ను హైకోర్టు ఆదేశాల మేరకు తిరిగి పునరుద్ధరించినట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు పంచాయతీ సర్పంచ్‌కు సంబంధిత ఉత్తర్వులను స్థానిక సచివాలయ కార్యదర్శి గురుమూర్తి మంగళవారం అందజేశారు. టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ఫిర్యాదు చేయడంతో సర్పంచ్ చెక్‌పవర్‌ను 3 నెలల కాలానికి నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై సర్పంచ్ సురేష్ కుమార్ హైకోర్టును ఆశ్రయించడంతో, జూలై 25న హైకోర్టు నుంచి జిల్లా పంచాయతీ అధికారికి ఉత్తర్వులందాయి. ఈ మేరకు తాజాగా మంగళవారం చెక్ పవర్‌ను తిరిగి పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జర్మన్ భాషపై శిక్షణ



పాతపట్నం, టెక్కలి: గిరిజన నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు సీతంపేట గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు ఎం.అన్నదొర ఒక ప్రకటనలో ఆయన మంగళవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తామని, యూరప్ దేశాల్లో నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవకాశం ఉందన్నారు. విశాఖపట్నంలో వసతి, భోజనం, శిక్షణ తరగతులు జరుగుతాయని, 35 ఏళ్ల వయసులోపు, బీఎస్సీ పూర్తి చేసి, రెండేళ్ల క్లినికల్ అనుభవం, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో నమోదు చేసిన మహిళలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

'ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వివిధ శాఖల అధికారులతో కలిసి విభాగాల వారీగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పింఛన్లు, అన్న క్యాంటీన్లు, మున్సిపల్ సేవలు, మహిళలపై నేరాలు, డ్రగ్స్ అరికట్టే విషయంలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో తాగునీటి నాణ్యతపై పరీక్షలు నిర్వహించాలని, మురుగు కాలువల పరిశుభ్రతపై జాగ్రత్తతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. చెత్త నుంచి సంపద సృష్టి ద్వారా తయారైన ఎరువులు గరిష్టంగా విక్రయించిన వారికి ప్రోత్సాహకంగా ప్రత్యేక గ్రాంట్లు అందజేస్తామని కలెక్టర్ ప్రకటించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ రేషన్ దుకాణాలపై సంబంధిత శాఖల సిబ్బంది తరచూ తనిఖీలు జరపాలని అన్నారు. రీ సర్వే పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

'ఆదికర్మయోగి'పై శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆదివాసీ ప్రాంతాల్లో పనిచేసే అధికారులకు ఆది కర్మ యోగి శిక్షణ ద్వారా పరిపాలనలో సమర్థత పెరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం, గ్రామ స్థాయిలో శాశ్వత మార్పులకు దోహదపడుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులకు ఆది కర్మ యోగి-రెస్పాన్సివ్ గవర్నెన్స్ ప్రోగ్రాంపై ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థంగా చేరాలంటే, అధికారులు వారి జీవన పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇది ఒక వినూత్నమైన ప్రజా భాగస్వామ్య కార్యక్రమమని గ్రామాల్లో యువత, మహిళలు, వలంటీర్లను శిక్షణతో నైపుణ్యం కలిగించి, స్థానిక సేవలలో మార్పునకు మార్గం వేయాలన్నదే లక్ష్యమని చెప్పారు.

శోక సంద్రం



- భావనపాడు తీరంలో ముగ్గురు విద్యార్థులు గల్లంతు
- ఎంత గాలించినా దొరకని ఆచూకీ
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

తీరం శోక సంద్రమైంది. సముద్ర ఘోషకు మించి రోదనలు వినిపించాయి. బంగారు భవిష్యత్ ఉన్న ముగ్గురు పిల్లలు గల్లంతు కావడంతో వారి తల్లిదండ్రుల కన్నీరు కలిసి కెరటాలు పోటెత్తాయి.



గల్లంతైన ప్రాంతం వద్ద ఉన్న వారి దుస్తులు, చెప్పులు

సంతబొమ్మాళి/వజ్రపుకొత్తూరు:

సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో మంగళవారం ముగ్గురు పాలిటెక్నిక్ విద్యార్థులు గల్లంతయ్యారు. వజ్రపుకొత్తూరు మండలం మడేవానిపేటకు చెందిన దున్న దుర్యోధన(18), పూడి జగన్నాథపురానికి చెందిన తిమ్మల జశ్వంత్ (18), పలాస మండల టెక్కలిపట్నంకు చెందిన రాయల రాజేష్(18)లు స్నేహితులు. వీరు ముగ్గురు విజయనగరంజిల్లా గజపతినగరంలోని బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నారు.

వారం కిందటే స్వగ్రామాలకు..

వీరు వారం కిందటే స్వగ్రామాలకు వచ్చారు. అందరూ క్లాస్‌మేట్స్ కావడంతో మంగళవారం సాయంత్రం భావనపాడు సముద్ర తీరానికి వచ్చి స్నానాలకు దిగారు. స్నానం చేసే సమయంలో సముద్రంలో ఆటు-పోటు ఎక్కువ కావడంతో 20 మీటర్ల మేర సముద్రం వెనక్కి వెళ్లింది. ఆ ప్రాంతమంతా ఇసుక మేటలతో ఉండడం వల్ల అనువుగా ఉంటుందని భావించి యువకులంతా అక్కడకు వెళ్లారు. కానీ వారు వెళ్లిన కాసేపటికే సముద్రపు పోటు



తీరంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎక్కువ కావడంతో నీరు ముందుకు రావడం వల్ల ఉవ్వెత్తున ఎగసి పడిన రాకాసి అలలకు విద్యార్థులు గల్లంతయ్యారు. ఆ సమయంలో దగ్గరలో మత్స్యకారులు ఎవరూ లేకపోవడంతో ఘోర ప్రమాదం జరిగింది. విద్యార్థుల ఆర్తనాదాలు వినేవారే కరువైపోయారు. ప్రమాదం జరిగిన స్థలానికి కొద్ది పాటి దూరంలో కొందరు మత్స్యకారులు గేలంతో చేపలు పడుతున్నారు. మత్స్యకారులు వీరిని గమనించి సంఘటన స్థలానికి వచ్చేలోపే ముగ్గురూ కనిపించకుండాపోయారు. బోట్లలో వెళ్లి గాలించినా విద్యార్థుల ఆచూకీ దొరకలేదు. డ్రోన్ కెమెరాతో వెతికినా ఆచూకీ లభించలేదు. సంఘటనా స్థలానికి తహసీల్దార్ హేమసుందరరావు, తన సిబ్బందితో చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. నౌపడ ఎస్‌ఐ నారాయణరావు, మెరైన్ పోలీసులు, మత్స్యకారుల సాయంతో రాత్రంతా గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి సంఘటన స్థలాన్ని సందర్శించారు. రాత్రి 9 గంటల వరకు జాడ కనిపించకపోవడంతో పది మంది యువకుల ప్రత్యేక బృందంతో సముద్రంలో గాలింపు చర్యలు ప్రారంభించారు. మరో పక్క చేతికి అందివచ్చే కుమారులు గల్లంతు కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



సంఘటనా స్థలం వద్ద తహసీల్దార్ హేమసుందరరావు, పంచాయతీ కార్యదర్శి రాజు, తదితరులు

ఏఎన్‌ఎం బదిలీల అక్రమాల్లో పాత్రధారులపై చర్యలు

- తాజాగా ఇద్దరికి మెమోలు జారీ
- ఇప్పటికే సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేసిన రీజనల్ డైరెక్టర్



జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం

అరసవల్లి: సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంల బదిలీల అక్రమాలు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయాన్ని ఓ కుదుపు కుదిపేస్తున్నాయి. ఇప్పటికే ఈ బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని, నిబంధనలన్నీ తోసిపుచ్చి వైద్యశాఖాధికారుల కనుసన్నల్లో బదిలీ స్థానాలను కేటాయించారంటూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆయన ఆదేశించారు. ఈ క్రమంలో వరుసగా చర్యలకు దిగుతున్నారు. ఇప్పటికే ఇదే అక్రమ వ్యవహారంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయ సూపరింటెండెంట్ డి.భాస్కర్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ వైద్య శాఖ రీజనల్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కె.అనిత కూడా బాధ్యులను గుర్తించి ఇద్దరికి తాజాగా మెమోలను జారీ చేశారు. అయితే ఇందులో సంబంధిత ఎస్టాబ్లిష్‌మెంట్ సీనియర్ అసిస్టెంట్ భవాని ప్రసాద్‌తో పాటు సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌కు కూడా మెమోలను జారీ చేశారు. అయితే ఇందులో ప్రొసీజర్ ఫాలో అవ్వకుండా ఆలస్యంగా మెమోలను జారీ చేసి చేతులు దులుపుకున్నారంటూ డీఎంహెచ్‌ఓ అనితపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఈ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది.

విమర్శల వెల్లువ

ఇటీవల జిల్లాలో మొత్తం 605 మందిలో 584 మంది ఏఎన్‌ఎంలకు బదిలీలు జారీ చేశారు. అయితే నిబంధనల ప్రకారం కాకుండా జూమ్ వీడియో మీటింగ్ ద్వారా బదిలీల ప్రక్రియను చేపట్టడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి విదితమే. అలాగే బదిలీల ఖాళీలను ఉన్నతాధికారి ఆమోదంతోనే ముందుగానే బ్లాక్ చేశారనే విమర్శలున్నాయి. అయితే దీనిపై అప్పట్లో ఏఎన్‌ఎంలంతా అర్ధరాత్రి వరకు కార్యాలయంలోనే బైటాయించి నిలదీయడంతో ఖాళీలన్నీ రిలీజ్ చేసి బదిలీలను చేసిన సంగతి విదితమే. అయితే అప్పటికే ఎవరికి కావాల్సిన స్థానాల్లో వారిని బదిలీలు చేసి రూ.లక్షల్లో వెనుకేసుకున్నారని ఆరోపణలున్నాయి. దీనిపై కూడా జిల్లా కలెక్టర్‌తో పాటు సీఎంకు కూడా ఫిర్యాదులు వెళ్లడంతో ఈ అక్రమాలపై చర్యలు వేగవంతం కానున్నాయి.

ఇప్పటికే ఈ బదిలీల అక్రమాల వ్యవహారంలో షోకాజ్ అందుకుని సస్పెన్షన్‌లో ఉన్న సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌కు ఇప్పుడు తాజాగా సోమవారం మెమో జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి సస్పెన్షన్ వేటుకు ముందే ఈ మెమోను ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఓ కీలక అధికారి తనదైన శైలిలో వ్యవహారంలో తన చేతికి మట్టి అంటకుండదన్నట్టుగా వ్యవహారాన్ని నడిపిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ వ్యవహారంలో ఒక్క భాస్కర్‌కుమార్‌నే బలి చేశారన్న చర్చ మొదలైంది.

దులీప్ ట్రోఫీకి విజయ్ ఎంపిక

- జిల్లా నుంచి దులీప్ ట్రోఫీకి ఎంపికైన మొట్టమొదటి క్రికెటర్‌గా గుర్తింపు
- బీసీసీఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో జరగనున్న పోటీలు



శ్రీకాకుళం న్యూకాలనీ: టెక్కలికి చెందిన క్రికెటర్ త్రిపురాన విజయ్ మరో మెగా టోర్నీకి ఎంపికయ్యాడు. బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో మెరవనున్నాడు. ఈ పోటీలు సెప్టెంబర్‌లో జరగనున్నాయి. జిల్లా నుంచి దులీప్ ట్రోఫీకి ఎంపికైన మొట్టమొదటి జిల్లా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. సౌత్‌జోన్ జట్టుకు ఆంధ్రా నుంచి ఇద్దరు క్రికెటర్లు ఎంపిక కాగా.. అందులో విశాఖకు చెందిన రిక్కీబుయ్ ఒకరు కాగా.. మరొకరు త్రిపురాన విజయ్ కావడం గమనార్హం. 2023-24 సీజన్ ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నమెంట్ అయిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లలో 26 వికెట్లు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. రంజీ మ్యాచ్‌లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా దులీప్ ట్రోఫీకి ఎంపికైనట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఎంపికై అందర్నీ ఆశ్చర్యపరిచిన విజయ్ తాజాగా ఏపీఎల్ నాల్గో సీజన్‌లో రికార్డు స్థాయిలో రూ. 7.55 లక్షలు దక్కించుకున్నాడు. రైటార్మ్ ఆఫ్ స్పిన్ బౌలింగ్, మిడిలార్డర్ బ్యాటింగ్‌తోపాటు బెస్ట్ ఫీల్డర్‌గా రాణిస్తున్నాడు. విజయ్ తల్లిదండ్రులు వెంకటకృష్ణరాజు, లావణ్య టెక్కలిలోని అయ్యప్పనగర్ కాలనీలో నివాసం ఉంటారు. తండ్రి సమాచారశాఖలో ఉద్యోగిగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. విజయ్ ప్రస్తుతం టెక్కలిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు.

చాలా సంతోషంగా ఉంది

దులీప్ ట్రోఫీకి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీలో నిలకడగా రాణించి జట్టు విజయాల్లో భాగస్వామ్యం అవుతాను. త్వరలో జరగనున్న ఏపీఎల్‌లో రాణించేందుకు కఠోర సాధన చేస్తున్నాను. నన్ను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, కోచ్‌లు, సంఘ పెద్దలకు కృతజ్ఞతలు.

– త్రిపురాన విజయ్, క్రికెటర్

అరాచక పాలన.. మరో ఉదాహరణ

- టీడీపీ వేధింపులకు గురైన మహిళ ఆత్మహత్యాయత్నం
- డీలర్‌షిప్ రద్దు చేసి వేరొకరికి కట్టబెట్టడంతో మనస్తాపం
- బతుకు తెరువు లేక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం



రిమ్స్‌లో వైద్య సేవలు పొందుతున్న ధనలక్ష్మి

శ్రీకాకుళం పాతబస్టాండ్: కూటమి అరాచక పాలనకు మరో ఉదాహరణ తారసపడింది. ఆమదాలవలస నియోజకవర్గంలో ఈ అరాచకం పరాకాష్టకు చేరింది. అసలే ఇసుక మాఫియా, భూ దందాలతో ఈ నియోజకవర్గం నిత్యం వార్తల్లో నిలుస్తోంది. దీనికి వేధింపులు తోడవుతున్నాయి. అధికార పార్టీకి అనుకూలంగా లేని వారు మనుషులే కాదన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఏ పార్టీకి సంబంధం లేకపోయినా వారి జీవన హక్కును కూడా కాలరాస్తున్నారు. కూటమి పాలకుల కుట్రకు ఓ మహిళ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. పదేళ్లుగా ఆమె నిత్యావసర సరుకుల డీలర్‌షిప్ నిర్వహిస్తుంటే.. కేవలం తమ అనుకూలురకు ఇచ్చేందుకు ఆమె డీలర్‌షిప్‌ను రద్దు చేశారు. దీనిపై ఆమె కోర్టుకు వెళితే కేసు ఉంటుండగానే మరొకరికి ఆ డీలర్‌షిప్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో ఆమదాలవలస మండలం మునగవలస గ్రామానికి చెందిన మునగవలస ధనలక్ష్మి మంగళవారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కార్యాలయానికి వస్తున్న సమయంలో విషం తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. వివరాల్లోకి వెళితే..

ఆమదాలవలస మండలం మునగవలస గ్రామానికి చెందిన మునగవలస శారదాంబ ఊరిలో రేషన్ డీలర్‌షిప్ నిర్వహించేవారు. ఆమె గతంలో చట్టపరంగా ఒక బాలికను దత్తత తీసుకున్నారు. ఆమెనే వారసురాలిగా ప్రకటించారు. శారదాంబ నిర్వహించే ఎఫ్‌పీ షాపు నిర్వహణ కూడా తన వారసురాలు ధనలక్ష్మికి అప్పగించారు. గత ప్రభుత్వం హయాంలో ఎలాంటి సమస్య లేకుండా ఆమె పనిచేసుకున్నారు. కానీ టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆమెకు వేధింపులు ప్రారంభమయ్యాయి.

దీంతో కొందరు గ్రామస్తులు షాపును డ్వాక్రా సంఘాలకు అప్పగించారు. అయినా డ్వాక్రా గ్రూపు లీడర్‌గా ధనలక్ష్మి ఆ షాపును నిర్వహించేవారు. కానీ ఇప్పుడు ఆమె డీలర్‌షిప్‌ను రద్దు చేసి వేరొకరికి ఆ బాధ్యతలు అప్పగించేందుకు టీడీపీ వర్గీయులు ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ కుట్రలు తెలుసుకున్న ధనలక్ష్మి తన డీలర్ షిప్‌ను నిలబెట్టుకునేందుకు హైకోర్టును ఆశ్రయించారు. ఆ కేసులో కోర్టులోనే ఉన్నా టీడీపీ నాయకులు వెరవకుండా వేరొకరికి డీలర్‌షిప్ కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. న్యాయస్థానంలో ధనలక్ష్మికి వ్యతిరేకంగా అఫిడవిట్ కూడా దాఖలు చేశారు. విషయం తెలుసుకున్న ధనలక్ష్మి తనకు ఉపాధి పోతుందన్న భయంతో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కలెక్టరేట్ వద్ద విషం తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. వెంటనే అక్కడున్న వారు ఆమెను పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు రిమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ధనలక్ష్మి రిమ్స్‌లో అత్యవసర విభాగంలో వైద్య సేవలు పొందుతోంది.


ఎరువు కోసం ఏకరువు



ఆమదాలవలస రైల్వే గూడ్స్ షెడ్ వ్యాగన్ నుంచి లారీలపై తరలిస్తున్న ఎరువులు

- అన్నదాతలకు తప్పని ఆందోళన
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ఆమదాలవలస రైల్వే గోదాంలో ఉన్న నిల్వలు
- పట్టించుకోని అధికారులు

ఆమదాలవలస రూరల్:



అన్నదాతలు ఎరువు కోసం ఏకరువు పెడుతున్నారు. తొలివిడత ఎరువులు వేసేందుకు అన్ని గ్రామాల్లో రైతులు సిద్ధమవుతున్నా ఎరువుల కొరత అన్నదాతలను కంటతడి పెట్టిస్తోంది. సకాలంలో ఎరువులు అందించకపోవటంతో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పలు గ్రామాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది ఇలా ఉంటే వ్యవసాయం చేయటం కష్టమని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ నాయకులకు ఎరువులు

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించే ఎరువులు కేవలం అధికార పార్టీ పాలకులకే అందాయి. రైతు సేవా కేంద్రాల్లో ఉండే రైతుల జాబితాలే ఇందుకు నిదర్శనం. ఆమదాలవలస మండలంలో 30 పంచాయతీలు ఉండగా ఈ పంచాయతీల పరిధిలో 5,160 హెక్టార్లు వరి సాగవుతోంది. దీనికి సుమారు 1000 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా 574 మెట్రిక్ టన్నుల ఎరువు మాత్రమే అందించగలిగారు.

కొరత పేరిట దోపిడీ

కొందరు దుకాణదారులు కొరత పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఒక యూరియా ఎరువుల బస్తా సుమారు రూ. 280కు విక్రయించాల్సి ఉండగా ఒక ఎరువు బస్తాకు దుబ్బు గులుకులు ప్యాకెట్ లింకు పెట్టి రెండింటికి కలిపి రూ.600 లకు పైబడి తీసుకుంటున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైల్వే గూడ్స్ షెడ్ గోదాం అధికా రులతో కొందరు ఎరువుల దుకాణదారులు చేతులు కలిపి కృత్రిమ కొరత సృష్టించి రైతులు నుంచి అధిక ధరలు గుంజుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎరువుల కొరతపై ఆమదాలవలస వ్యవసాయ శాఖాధికారి మెట్ట మోహనరావు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా రైతులకు రెండో విడత అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

దొంగ నిల్వలు

ప్రైవేటు వ్యాపారుల దుకాణాలకు అందించేందుకు రైల్వే గోదాంలలో కొందరు దొంగ నిల్వలు చేసి దొడ్డిదారిన తరలిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కేవలం అధికారులు ప్రైవేటు దుకాణ యజమానుల వద్ద నుంచి కమీషన్ల కోసమే అడ్డదారులు తొక్కుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు.



ఆమదాలవలస రైల్వే గూడ్స్ షెడ్ ఎదురుగా ఉన్న గోదాంలో ఎరువుల నిల్వలు

9న పాతపట్నంలో ఆదివాసీ దినోత్సవం

పాతపట్నం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు సీతంపేట ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని ఉన్న 16 మండలాల గిరిజన ప్రజలతో పాతపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గిరిజన పండుగను గిరిజన ఆచార సంప్రదాయాలు, గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా నిర్వహిస్తామన్నారు. గిరిజన ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరునికి శ్రావణ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.



పార్వతీ పరమేశ్వరులకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

ఇదేనా విద్యుత్ చార్జీలు తగ్గించడం..?

- ప్రభుత్వంపై విరుచుకుపడిన జిల్లా వామపక్ష పార్టీల నేతలు



విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు, కార్యకర్తలు

అరసవల్లి: వినియోగదారునికి దగా చేసే స్మార్ట్ మీటర్లు వద్దు..ట్రూ అప్ చార్జీల భారం వద్దంటే వద్దంటూ జిల్లా వామపక్ష పార్టీ నేతలు నిరసనకు దిగారు. స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, అలాగే స్మార్ట్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ తదితరులు మాట్లాడుతూ ఎన్నికల ముందు అదానీ కంపెనీ వాళ్ల స్మార్ట్ మీటర్లను బిగిస్తామని వచ్చినప్పుడు ఆ మీటర్లు బద్దలుకొట్టాలంటూ పిలుపునిచ్చిన నారా లోకేష్‌కు, ఇప్పుడెందుకు స్మార్ట్ మీటర్లను వద్దనడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వం పెంచిన ట్రూ అప్ చార్జీలు, సర్‌చార్జీలు అదనపు భారంగా విద్యుత్ బిల్లులు భారీగా షాకిస్తుంటే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారన్నారు. ఇది చాలదన్నట్లుగా మరో రూ.12,771 కోట్ల భారాన్ని అదనపు చార్జీల పేరిట జనం నెత్తిన వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఎన్నో ప్రకటనలు చేశారని, అసలు విద్యుత్ చార్జీలు పెంచబోనని, వీలు ప్రకారం తగ్గిస్తానంటూ ప్రకటనలు గుప్పించి అధికారంలోకి వచ్చారని...ఇప్పుడు తొలి ఏడాదిలోనే దారుణంగా విద్యుత్ చార్జీలు పెంచారని గుర్తు చేశారు. ఇదేనా తగ్గించడమంటే అంటూ విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకునేలా చర్యలు చేపట్టాలని, లేదంటే ఉద్యమిస్తామని వామపక్ష పార్టీలు హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు కొత్తకోట అప్పారావు, ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాష్, బి.సింహాచలం, ఆదినారాయణమూర్తి, వెంకటరావు పాణిగ్రాహి, ఎ.లక్ష్మి, శ్రీదేవి పాణిగ్రాహి. కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు సుప్రజ



యోగాసనాలు వేస్తున్న సుప్రజ

నరసన్నపేట: తాడేపల్లిగూడెంలో ఈ నెల 21న జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు నరసన్నపేట శ్రీరామ్‌నగర్‌కు చెందిన వండాన సుప్రజ ఎంపికయ్యారు. నరసన్నపేటలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో సుప్రజ ట్రెడిషనల్ యోగా, సుపైన్ యోగా విభాగాల్లో మొదటి స్థానం సాధించారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపిక చేసినట్లు నేషనల్ యోగా స్పోర్ట్ ఫెడరేషన్ ప్రతినిధులు సమాచారం ఇచ్చారని యోగా గురువు సదాశివుని రవి మంగళవారం తెలిపారు.

వజ్రోత్సవాలకు ప్రత్యేక సంచిక



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఇంటాక్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షణలో వజ్రోత్సవాల ప్రత్యేక సంచిక విడుదల చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సంచికలో ప్రచురించాల్సిన వ్యాసాలపై మంగళవారం జిల్లా ప్రముఖులతో సమీక్షించారు. అనంతరం కొన్ని ఆర్టికల్స్‌ను ఎంపిక చేసి కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌లకు వివరించారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ సన్యాసిరావు, కో కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్ వి.జగన్నాథంనాయుడు, సంచిక కమిటీ సభ్యులు ఎల్.రామలింగస్వామి, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ. వెనుక నిందితులతో పోలీసులు

సోంపేట: సోంపేటతో పాటు జిల్లాలో పలు పోలీసుస్టేషన్ల పరిధిలో ఏటీఎంల వద్ద ప్రజలను మభ్యపెట్టి నగదు తస్కరించిన ముగ్గురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పలనాయుడు తెలిపారు. సోంపేట సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.మంగరాజుతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 5న ఉదయం సోంపేట ఎస్ఐ వి.లోవరాజు, కంచిలి ఎస్ఐ పారినాయుడు సోంపేట బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఒడిశా రాష్ట్రానికి చెందిన డి.హరిహర రెడ్డి, సింహాచలం సాహు, బురిడి అశోక్ పాత్రో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకుని విచారించగా జిల్లాలోని పలు ఏటీఎంల వద్ద ఏటీఎం కార్డులు మార్చి దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరు రూ.17,21,240 చోరీ చేయగా.. అందులో రూ.5,60,000 రికవరీ చేసుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ఎస్పీని కలిసిన ఏఆర్ ఆర్ఐ

ఎచ్చెర్ల : మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా బదిలీపై వచ్చిన ఎస్.శంకర్‌ప్రసాద్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను బహూకరించిన అనంతరం స్థానిక పరిస్థితులపై కాసేపు చర్చించారు.

జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: సౌత్‌జోన్ నేషనల్స్ మీట్‌కు ముందు జరిగే ఏపీ జూనియర్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల జాబితా ఖరారైంది. ఎంపికైన 80 మందికిపైగా అథ్లెట్స్ వివరాలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్ల జిల్లా చీరాల వేదికగా స్టేట్‌మీట్ జరగనుంది. ఈ పోటీల్లో అండర్-14, 16, 18, 20 నాలుగు వయో విభాగాల్లో పోటీలు జరగనున్నందున క్రీడాకారుల ఎంపికలను ఇటీవల శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఎంపికైన క్రీడాకారులంతా ఈ నెల 7న రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ వద్దకు తమ లగేజీతోపాటు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, 2 పాస్‌ఫొటోలతో చేరుకుని సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి కె.మాధవరావు (9441570361)ను సంప్రదించాలని మధుసూదన్, సాంబమూర్తి పేర్కొన్నారు. జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల బృందానికి కోచ్ మేనేజర్లగా అథ్లెటిక్స్ కోచ్ కె.రామారావు, పీఈటీ ఇ.అప్పన్న వ్యవహరించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 8500271575 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పొట్టకొట్టొద్దు..!

- ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విభజనపై మండిపడుతున్న దళితులు
- సొంత గొడౌన్లు కాదని టెక్కలిలో అద్దెకు తీసుకోవడంపై విస్మయం
- మూడు తరాల జీవనాధారాన్ని దూరం చేసే పనులపై ఆగ్రహం
- మంత్రి అచ్చెన్నాయుడి వర్గీయులకోసమేనని మండిపాటు



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేస్తున్న ఐఎంఎల్ యూనిట్ కార్మికులు(ఫైల్)

ఎచ్చెర్ల : రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్లలోని ఐఎంఎల్(ఇండియన్ మేడ్ లిక్కర్) డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులపై అందులో పనిచేస్తున్న దళిత కుటుంబాలు మండిపడుతున్నాయి. తరతరాలుగా ఈ డిపోను నమ్ముకుని సుమారు 350 కుటుంబాలు జీవనాన్ని సాగిస్తున్నాయి. డిపో విభజన జరిగితే తామంతా రోడ్డున పడతామని వాపోతున్నారు. సొంత గొడౌన్లలో చక్కగా నడుస్తున్న డిపోను అదనపు ఖర్చులు చేసి ఎవరి ప్రయోజనాలకోసం విడదీయాల్సి వస్తుందో సమాధానం చెప్పాలని బాధిత కుటుంబాల వారు ప్రశ్నిస్తున్నారు.

మూడు తరాలుగా జీవనాధారం

ఎచ్చెర్ల గ్రామంలో 100 మంది దళిత కుటుంబాలకు చెందిన వారి నుంచి జాతీయ రహదారికి పక్కన కోట్లాది రూపాయలు విలువచేసే నాలుగు ఎకరాల భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. తీసుకున్న భూమిలో అప్పట్లో సారాతయారీ కేంద్రం ప్రారంభించింది. ఇందులో భూములు ఇచ్చిన కుటుంబాలకు చెందిన 40 మందికి ఉపాధి కల్పించింది. 1992లో యారక్ బాటిలింగ్ యూనిట్ ఏర్పాటుచేసి బ్రాందీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వీరినే కార్మికులుగా, హమాలీలుగా కొనసాగించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఈ కుటుంబాలకు చెందిన వారంతా డిపోను నమ్ముకుని జీవిస్తున్నారు. ఇప్పుడు విభజన చేపట్టి మూడు తరాలుగా నమ్ముకున్న తమ జీవనాధారాన్ని దూరం చేయడంపై వీరంతా మండిపడుతున్నారు.

అవసరం లేకున్న అద్దెకు..

ఎచ్చెర్లలో ఐఎంఎల్ డిపో సొంత గొడౌన్లలో ఎలాంటి వివాదాలు లేకుండా నడుస్తున్నప్పుడు టెక్కలిలో అద్దెకు తీసుకుని మరీ డిపో ఏర్పాటుచేయాలనుకోవడంపై వీరంతా విస్మయం చెందుతున్నారు. మంత్రి అచ్చెన్నాయుడి వర్గీయుల ప్రయోజనాల కోసం లక్షలాది రూపాయలు అదనపు ఖర్చు చేసి అద్దె భవనంలో డిపోను పెట్టడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని కార్మికులు విమర్శిస్తున్నారు. ఎచ్చెర్లలో సరిపడా గొడౌన్, అధికార కార్యాలయ విభాగం, స్థలం, కార్మికులు ఉన్నారని, ఇక్కడ నుంచి అన్ని షాపులకు సకాలంలో సరుకులు అందుతునే ఉన్నాయని, అయినప్పటికీ విభజన పేరుతో టెక్కలిలో లక్షలాది రూపాయలు అద్దెలు చెల్లించి డిపో పెట్టాలనుకోవడం వెనుక అర్థమేంటని వారంతా ప్రశ్నిస్తున్నారు.

అవసరం లేకపోయినా..

ఎక్కడైనా ఓ డిపోపై పనిభారం పెరుగుతుంటే మరో డిపో ఏర్పాటుకు చర్యలు తీసకుంటారు.



ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో

ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా భవిష్యత్తులో పనిభారం తగ్గనున్న డిపోను విడదీస్తున్నారని కార్మికులు అంటున్నారు. ప్రస్తుతం ఈ డిపో ద్వారా జిల్లాలో 231 వైన్‌షాప్‌లు, బార్లకు సరుకు సరఫరా అవుతుంది. పార్వతీపురం మన్యం, రాజాం ప్రాంతాలకు చెందిన 48 షాపులకు ఈ డిపో ద్వారా భవిష్యత్తులో సరుకులు సరఫరా చేయాల్సిన పనిలేదు. ఇప్పటికే వీరంతా మద్యం మాత్రమే ఇక్కడ నుంచి తీసుకువెళ్తున్నారు. మిగతా తతంగమంతా ఆయా ప్రాంతాల్లోనే జరుపుకుంటున్నారు. అలాంటప్పుడు రెండో డిపో అవసరం లేదని కార్మికులు, పలు సంఘాల నాయకులు అంటున్నారు.

మంత్రి వర్గీయుల కోసమేనా?

వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి వర్గీయుల స్వలాభం కోసం డిపో విభజన చేపడుతున్నారని ఇక్కడ సర్వత్రా చర్చించుకుంటున్నారు. టెక్కలి ప్రాంతంలో తన వర్గీయులకు వైన్‌షాపులు ఎక్కువగా ఉండటం వల్ల రవాణా ఖర్చులు తగ్గి లాభాలు వస్తాయని, తన వర్గానికి చెందిన వారికి అద్దె గొడౌన్‌లో పెడితే లక్షలాది రూపాయలు లాభాలు వస్తాయని, స్థానికులకు ఉపాధి కల్పించి సానుభూతి పొందవచ్చనే ఉద్దేశంతో ఇక్కడ డిపో విభజన చేపడుతున్నారని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఇక్కడ ఎన్నో ఏళ్లుగా ఉపాధి పొందుతున్న దళితులకు జీవనాధారం పోతుందని ఎచ్చెర్ల దళిత కుటుంబాలు, కార్మికులు వాపోతున్నారు.

పదిపైసల నుంచి పని..

మూడు తరాలుగా పదిపైసలు కూలీ నుంచి పనిచేస్తున్నామని దళితులు చెబుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న హమాలీలకు ప్రస్తుతం రోజుకు రూ.800 వరకూ కూలీ వస్తోంది. లారీ నుంచి మద్యం పెట్టెలను దించి గోడాంలో పేర్చి తిరిగి గేటు బయట మద్యం షాపులకు లోడ్ చేయడానికి పెట్టెకు రూ.8 ఇస్తారు. ఇలా ఒకరోజు పనిఉంటే ఎక్కువ డబ్బులు మరో పనిలేకపోతే తక్కవ డబ్బులు వస్తాయి. వీటిని హమాలీలంతా కూలీగా పంచుకుంటారు. వీటితోనే జీవనం గడుపుతున్నారు. ఇప్పుడు డిపో విడిపోతే పెట్టెల సంఖ్య తగ్గిపోయి సగానికిపైగా కూలీ తగ్గిపోతుందని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తరతరాలుగా జీవిస్తున్నాం



డిపోను నమ్ముకుని మూడు తరాలుగా జీవనం కొనసాగిస్తున్నాం. డిపో విడదీస్తే కూలీ సగానికి పడిపోతుంది. ఇక్కడ సొంత భూములను డిపో కోసం ఇచ్చాం. పది పైసలు కూలీ నుంచి ఇక్కడ మూడు తరాలుగా పనిచేస్తున్నాం. ఇప్పుడు మా ఉపాధి దెబ్బతీయడం అన్యాయం.

– నిడిగింట్ల రమణ, కార్మికుడు

జీవితాలతో ఆటలా..



ఇక్కడ ఎన్నో ప్రమాదాలకోర్చి పనులు చేపడుతున్నాం. నమ్ముకుని 350 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఎటువంటి ప్రమాదం జరిగినా ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించదు. మా డబ్బులతో మేమే బాగుచేసుకోవాలి. ఇప్పుడు ప్రభుత్వం ఇటువంటి జీవోలను జారీ చేసి మా బతుకులతో ఆడుకోవద్దు.

– లండ, సీతారాం, కార్మికుడు

పాలకుల తీరుపై మండిపాటు..

తమ జీవితాలతో ఆడుకోవాలని చూస్తున్న పాలకుల తీరుపై దళితులు మండిపడుతున్నారు. తమ జీవనాధారాన్ని దూరం చేసే జీవోలను వెంటనే వెనక్కి తీసుకుని తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఎచ్చెర్లలో సొంత గొడౌన్లలో మద్యం సరఫరా చేస్తుంటే అదనంగా టెక్కలిలో మరో డిపో అద్దెకు తీసుకుని ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న 'ఏపీఎస్‌బీసీఎల్/1/ఎంఎంవై/2025-26/356'ను జారీ చేయడంపై వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరడిగారు?



జిల్లా నుంచి 232 షాపులు, బార్లు నుంచి మద్యం తీసుకువెళ్లేందుకు వస్తుంటారు. ఏ షాపు వారు కూడా తాము ఇబ్బందులు పడుతున్నాం.. రెండో డిపో కావాలని కోరడం లేదు. ఇక్కడ సౌకర్యంగా ఉన్నప్పుడు మరో డిపోను ఏర్పాటుచేసి కార్మికుల పొట్టకొట్టడం అన్యాయం. ప్రభుత్వం జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలి.

– డి.బంగార్రాజు, హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

ఉపాధికి దెబ్బ



ఎచ్చెర్లలో ఐఎంఎల్ డిపోకోసం భూములు ఇచ్చారు. వాటికి ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదు. వారికి నష్టపరిహారం అందించడం, పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తిచేయడం, రైతులను ఆదుకోవడం వంటి వాటిపై దృష్టి పెట్టాల్సిన మంత్రి అచ్చెన్నాయుడు ఇలా కార్మికులు ఉపాధిని దెబ్బతీయాలని చూడటం తగదు.

– సీహెచ్ అమ్మన్నాయుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

భక్తుల కళ్లకు గంతలు!

- అరసవల్లిలో మొక్కుల పేరిట నకిలీ కళ్లు
- అడ్డుకట్ట వేసేందుకు యంత్రాంగం సన్నద్ధం



హుండీ కానుకల లెక్కింపులో బయటపడ్డ నకిలీ బంగారు, వెండి కళ్లు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి ఆదిత్యునికి ఆరోగ్యం కోసం భక్తులు పలు రకాల మొక్కులు చెల్లించుకోవడంఆనవాయితీగా వస్తోంది. ఇదే క్రమంలో భక్తుల మనోభావాలు, విశ్వాసాలతో సొమ్ము చేసుకునేలా కొందరు నకిలీ బంగారు, వెండి కళ్లను విక్రయిస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ముఖ్యంగా భక్తులు సూర్యునికి గుర్తుగా బంగారం, చంద్రునికి గుర్తుగా వెండి కళ్లను మొక్కులుగా ఆలయం లోపల హుండీల్లో సమర్పిస్తుంటారు. రూ.30 నుంచి రూ.80 చొప్పున ఈ నకిలీ కళ్లను భక్తులకు ఆలయం చుట్టుపక్కల దుకాణాల్లో విక్రయిస్తుంటారు. దీంతో ప్రతి హుండీ కానుకల లెక్కింపు రోజున వేలాది నకిలి కళ్లు బయటకు వస్తున్నాయి. వీటిని ఇంతవరకు తగులబెట్టి ఇందులో అసలైన బంగారం, వెండి ఉంటే వెలికి తీసేవారు. తాజాగా ఈ నకిలీల సంఖ్య దారుణంగా పెరిగిపోవడంతో ఆలయ అధికారులు ఇందుకు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తున్నారు.

కేసులు పెడితేనే..

నకిలీల తయారీదారులపై కేసులు నమోదు చేయాలని, తద్వారా ఆలయ పరిసరాల్లో నకిలీల విక్రయాలకు చెక్ పెట్టొచ్చు అనే విధంగా చర్యలకు దిగుతున్నారు. 'నకిలీ కళ్లను స్వామికి మొక్కులుగా సమర్పిస్తే.. స్వామి నుంచి కూడా నకిలీ ఆశీస్సులే ఆశిస్తున్నారా.. అంటూ..' ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ భక్తుల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. భక్తులు కూడా ఈ నకిలీలపై అవగాహన పెంచుకుని ప్రశాంతంగా స్వామికి మొక్కుకుని వెళ్తే అంతా మంచి జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ అంటున్నారు. అరసవల్లి ఆలయానికి ఒక బ్రాండ్ ఉందని, ఇలాంటి నకిలీ మొక్కుల చెల్లింపుల పేరిట భక్తుల విశ్వాసాలు సన్నగిల్లే అవకాశాలుండడంతో ఆలయ అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ నకిలీల విక్రయాలపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారమెప్పుడు?



తమ గ్రామానికి లో-ఓల్టేజీ సమస్య ఉందని అధికారులకు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కరించడం లేదంటూ సంతబొమ్మాళి మండలం పాలనాయుడుపేట గ్రామస్తులు మంగళవారం రాత్రి నౌపడ్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేశారు. ప్రతి రోజూ రాత్రి 7 గంటలు కాగానే లో ఓల్టేజీ సమస్య ఏర్పడటంతో విద్యార్థులు చదువుకోలేకపోతున్నారని మండిపడ్డారు. సమస్య పరిష్కరించే వరకు సబ్ స్టేషన్ నుంచి కదిలేది లేదంటూ నినాదాలు చేశారు. అనంతరం సిబ్బంది స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులంతా వెనుదిరిగారు. – టెక్కలి

గంజాయి గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

పలాస: పలాస రైల్వే స్టేషన్ నుంచి తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 16 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం కాశీబుగ్గలో డీఎస్పీ వి.వెంకట అప్పారావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం టెన్‌కాశీ గ్రామానికి చెందిన ముత్తు రామన్, మారీ ముత్తులకు అదే ప్రాంతానికి చెందిన మణికంఠ అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన పిత్తా వాస్‌ను పరిచయం చేశాడు. పిత్తావాస్ తన గ్రామంలో గంజాయి పండించి విక్రయిస్తుంటాడు. ఇతనని నుంచి గంజాయిని తీసుకొస్తే కిలోకు రూ.1500లు ఇచ్చేందుకు ముత్తురామన్, మారీ ముత్తుతో పాటు మరో వ్యక్తి మైలపాపూర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. మైలపాపూర్ పలాస వచ్చి 16 కిలోల గంజాయి బస్తాను ముత్తురామన్, మారీ ముత్తులకు అందజేశాడు. వారిద్దరూ తమిళనాడు తరలించడానికి పలాస రైల్వే స్టేషన్‌లో సిద్ధంగా ఉండగా పోలీసులు అరెస్టు చేశారు. సమావేశంలో కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, ఎన్ని ఆర్.నరసింహమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

12.65 కిలోల గంజాయితో..

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి ముంబైకు 12.65 కిలోల గంజాయి తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన మణికుమార్‌నారాయణ బాయ్‌పవార్‌ను ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద అరెస్ట్ చేసినట్టు సీఐ ఎం.చిన్నమనాయుడు తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం తనిఖీలు జరుపుతుండగా మణికుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ ముకుందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయి బ్యాచ్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని మడపాం బ్రిడ్జి, కరజాడ ఇసుక ర్యాంప్ పరిసర ప్రాంతాల్లో బ్రిడ్జి కింద ఆరుగురు వ్యక్తులు గంజాయిను ఓ ఆటోలో రవాణా చేసేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ రాము తెలిపారు. వీరి వద్ద నుంచి 24 కేజీల గంజాయి, 6 సెల్ ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. డబ్బులతో జల్సాలు చేసేందుకు గంజాయిను ఒడిశా రాష్ట్రం నుంచి కొనుగోలు చేసినట్లు తెలిసిందన్నారు. చిన్నచిన్న ప్యాకెట్‌లుగా చేసి శ్రీకాకుళం, ఆమదావలస, నరసన్నపేట తదితర ప్రాంతాల్లో స్థానికంగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.

ఆశ్రమ పాఠశాల బాలికల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మందస : పాఠాలు చెప్పాలని అడిగితే ఉపాధ్యాయులు తిడుతున్నారంటూ మందస మండలం పట్టులోగాం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల వద్ద తల్లిదండ్రులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు టీచర్లు పాఠాలు చెప్పకుండా తరగతి గదుల్లో సెల్‌ఫోన్లలో నిమగ్నమైపోతున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే తమకు ఇష్టముంటేనే పాఠాలు చెబుతామని అంటున్నారని వాపోయారు. తమ జాతిని హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు, హిందీ, సోషల్ టీచర్ల వ్యవహార శైలి సరిగ్గా లేదని చెప్పారు. హిందీ పాఠాలు చెప్పమని టీచర్‌ను కోరగా.. తాను మూడేళ్ల పాటు వార్డెన్‌గా పనిచేశానని, పాఠాలు బోధించేందుకు కొంత సమయం కావాలని అంటున్నారని, అంతవరకు వింటే వినండి లేకపోతే మానేయండి అంటూ తెగేసి చెబుతున్నారని వాపోయారు. టీసీలు ఇచ్చేయాలని అధికారులకు విన్నవిస్తే సర్దుకుపోవాలని అంటున్నారని, తమకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇదేం నిర్వహణ!



రేషన్ డిపో తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

రణస్థలం: రేషన్ దుకాణాల వద్ద రికార్డులు, ధరల, నిల్వ సామర్థ్య పట్టికలు ప్రదర్శించకపోవడంపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బక్కముంతల కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రణస్థలం మండలం పతివాడపాలెం, పైడిపేట, జె.ఆర్.పురం రేషన్ దుకాణాలతో పాటు పిన్నింటిపేట అంగన్‌వాడీ కేంద్రం, జె.ఆర్.పురం హైస్కూల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పతివాడపాలెం, పైడిపేట రేషన్ డిపోల్లో డిస్‌ప్లే బోర్డులు ప్రదర్శించకపోవడం, స్టాక్‌లో తేడాలు గుర్తించడంతో మెమో జారీలు చేయాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. పిన్నింటిపేట అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ రిపోర్టుకు మించి గుడ్లు ఎక్కువగా ఉండటంపై మెమో జారీ చేయాలని ఐసీడీఎస్ పీవోను ఆదేశించారు. తనిఖీల్లో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఏఎం ప్రసన్నకుమారి, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీరాములు, తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీవో రూపలత, సివిల్ డీటీ అరుణ పాల్గొన్నారు.



మూడు నెలలుగా.. ముప్పుతిప్పలు

- జీతాలకు నోచుకోని బదిలీ ఉపాధ్యాయులు
- పొజిషన్ ఐడీని సాకుగా చూపిస్తున్న ప్రభుత్వం
- జీతాల నిధులు ఇతర పథకాలకు మళ్లించారని ఆరోపణలు

శ్రీకాకుళం : బదిలీ ఉపాధ్యాయుల జీతాలకు మోక్షం కలగడం లేదు. జిల్లాలో మే నెలలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా వేరొక పాఠశాలకు వెళ్లిన 1140 మందికిపైగా ఉపాధ్యాయులు మూడు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక, ఈఎంఐలు కట్టలేక, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి ఏదోలా నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొజిషన్ ఐడీని సాకుగా చూపించి జీతాలు చెల్లింపులో తాత్సారం చేస్తుండడం పట్ల ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులను ఓ చోటు నుంచి మరో చోటుకు బదిలీ చేశారే తప్ప అదనంగా నియామకాలు చేపట్టలేదని, అటువంటప్పుడు జీతాలు చెల్లింపునకు పొజిషన్ ఐడీలు దేనికని సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ సందర్భంలో మండల స్థాయి అధికారుల నుంచి ఏ పాఠశాల నుంచి ఏ పాఠశాలకు పోస్టులు బదిలీ అవుతున్నారనే వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, వాటిని ఆర్థిక శాఖకు బదలాయిస్తే ఓ రోజులో జీతాలు చెల్లింపు పూర్తి చేయవచ్చని, అటువంటిది మూడు నెలలుగా తాత్సారం చేయడం పట్ల ఉపాధ్యాయ వర్గం తప్పుపడుతోంది. ఈ కుబేర్ కుదేల్ అయిందని, జీతాల నిధులు వేరొక పథకానికి మళ్లించడం వల్ల జీతాలు చెల్లించలేని స్థాయికి ప్రభుత్వం వెళ్లిందని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. తాము డీఏలు, పీఆర్‌సీల కోసం డిమాండ్ చేయకుండా ఉండేందుకు తమ దృష్టిని మళ్లించేందుకు కూడా ప్రభుత్వ పెద్దలు జీతాలు చెల్లించకుండా కుతంత్రాలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పొజిషన్ ఐడీ ఫైల్పై ముఖ్యమంత్రి సంతకం చేయాల్సి ఉందని రాష్ట్ర అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అంటున్నారు. ఏ ఫైల్ పై ఎవరు సంతకం చేయాలో తెలియనంత పిచ్చివారు ఉపాధ్యాయులు కాదని, ఇటువంటి విధానాలపై సమయం వచ్చినప్పుడు సరైన సమాధానం చెబుతామని ఉపాధ్యాయులు బహిరంగంగానే చెబుతున్నారు.

జిల్లాలో జీతాలకు నోచుకోని ఉపాధ్యాయులు వీరే..	
మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు	385
బేసిక్ ప్రైమరీతో ఉన్న హైస్కూల్లో పనిచేస్తున్న ఎస్జీటీలు	198
మోడల్ ప్రైమరీ తరగతులతో ఉన్న హైస్కూల్ ఎస్జీటీలు	82
క్లస్టర్ అకడమిక్ టీచర్లుగా బదిలీ పొందిన వారు	90
ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో రెండు, మూడవ పోస్టులో చేరిన ఎస్జీటీలు	385

అప్పుడు సాఫీగా..

2023లో పోస్టుల పునర్వ్యవస్థీకరణ జరిపి బదిలీలు చేపట్టినప్పుడు అప్పటి ప్రభుత్వం డీఈఓ పూల్లో ఉన్న పండితులు, పీఈటీలు మినహా ఏ ఒక్కరికి జీతాలు చెల్లింపును ఆలస్యం చేయలేదని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గుర్తు చేస్తున్నారు. డీఈవో పూల్లో ఉన్న వారికి కూడా నెల లోగానే జీతాలు చెల్లించేశారని, అప్పుడు ఆ ప్రభుత్వానికి రాని అడ్డంకులు ప్రస్తుత ప్రభుత్వానికి ఎందుకు వస్తున్నాయని నిలదీస్తున్నారు. సీఎంఎఫ్ఎస్, ఈ కుబేర్లను గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చారని, వీటి ద్వారా బడ్జెట్‌ను తమకి ఇష్టం వచ్చినట్లుగా ఖర్చు చేసుకునే సౌలభ్యం ఉందని, దానిని వినియోగించి నిధులను ఇష్టానుసారం బదలాయింపులు జరపడం వల్ల ఇటువంటి పరిస్థితి వచ్చిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 117 జీవోను ఉపాధ్యాయులు వ్యతిరేకించడం, ఉద్యోగ ఉపాధ్యాయుల జీతాల చెల్లింపును సీఎంఎఫ్ఎస్ నుంచి బయటికి తీసుకురావాలని నిర్ణయించగా అప్పట్లో తాము అనవసరంగా అప్పటి ప్రభుత్వంపై విద్వేషం పెంచుకొని వ్యతిరేకించడం పట్ల ఇప్పుడు తీవ్ర ఆవేదన చెందుతూ మనోవేదనకు గురవుతున్నారు. సీఎంఎఫ్ఎస్ నుంచి జీతాల చెల్లింపు బయటకు వస్తే జీతాలు నిధులు వేరొక దానికి మళ్లించేందుకు అవకాశం ఉండదని, గతంలో మాదిరిగానే ట్రెజరీల ద్వారా ప్రత్యేక పద్దు ద్వారా జీతాలు పొందే అవకాశం ఉండేదని ఆవేదనతో అంటున్నారు.

నిధులు మళ్లించేందుకే..



బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోవాల్సి వస్తోంది. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిధులను ఇష్టానుసారం బదలాయించుకునేందుకే సీఎంఎఫ్ఎస్ విధానం తీసుకువచ్చారు.

– పేడాడ ప్రభాకరరావు, ఎస్టీయూ నాయకుడు

దృష్టి మరల్చేందుకే..



ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల దృష్టి మరల్చేందుకే జీతాలు చెల్లింపులో జాప్యం చేస్తున్నారు. డీఏ, పీఆర్‌సీతోపాటు ఉపాధ్యాయ సమస్యలు ప్రస్తావించకుండా ఉండేందుకు ఇటువంటి కుతంత్రాలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో ఉపాధ్యాయ ఉద్యమం తప్పదు.

– గొంటి గిరిధర్, యూటీఎఫ్ నాయకుడు